ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 4 ఆగస్టు 2025



● నెల్లూరు రూరల్ మండలం వెల్లంటి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(పేరుమార్చాం)ది నిరుపేద కుటుంబం. కుటుంబ అవసరాలు, వైద్యం ఖర్చుల కోసం ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ వద్ద ఇంటిని తనఖా పెట్టి అప్పు తీసుకున్నాడు. నెలనెలా ఈఎంఐ భారాన్ని మోయలేక రుణం తీర్చడం ఆలస్యమైంది. వెంటనే రంగంలోకి దిగిన ఆ సంస్థ ప్రతినిధులు ఇంటికి తాళం వేసి, గోడపై ఈ ఇల్లు తనఖాలో ఉందని రాసివెళ్లారు. దీంతో గ్రామస్థులకు ముఖం చూపించలేక వెంకటేశ్వర్లు కొన్నాళ్లుగా ఊరిబయటే ఉంటున్నాడు.

● అలాగే రూరల్ మండలం కొండ్లపూడి పంచాయతీ రాజగోపాలపురంలో మరో కుటుంబం కూడా మైక్రో ఫైనాన్స్ ఊబిలో చిక్కుకుంది. అధిక వడ్డీలతో రుణభారం ఎక్కువై.. ఇంటికి వచ్చి రుణసంస్థ ప్రతినిధులు వేసే దూషణలు, పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆ కుటుంబం ఊరు వదిలి వెళ్లిపోయింది.

'మైక్రో నాగుల' బుసలు

● దళితవాడలే లక్ష్యంగా ఫైనాన్స్ వ్యాపారం

● అడిగినంత ఇస్తామని ఇళ్లువాకిళ్ల తనఖా

● అధికవడ్డీలతో ఈఎంఐలు కట్టలేక బెంబేలు ● రెండేళ్లుగా పేట్రేగుతున్న రుణ సంస్థలు

నెల్లూరురూరల్, ఆగస్టు 3,(ఆంధ్రజ్యోతి): ఇలా... ఆ రెండు గ్రామాలే కాదు. నెల్లూరు రూరల్ మండలంలోని అన్నీ గ్రామాల దళితవాడల్లోని పరిస్థితి ఇది. గత రెండేళ్లగా అవసరాలకు రుణాలిస్తామని మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రామాల్లో కాలనాగులై బుసలు కొడుతున్నాయి. హరిజనులు, గిరిజనుల అవసరాలను ఆసరాగా చేసుకుని, ముందుగా రుణం ఇచ్చి ఆ తరువాత ఇళ్లువాకిళ్ల తనఖా పెట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొంతమంది గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు కూడా పాలుపంచుకుంటున్నట్లు సమాచారం. వీరిచ్చే ధ్రువీకరణల వల్లే గ్రామ కంఠానికి చెందిన నివాసాలను రిజిస్టేషన్ చేయించి, తనఖా పెట్టుకుని ఆపై రుణ సంస్థల వారు నగదును అప్పుగా ఇస్తున్నారు. అనంతరం రుణం చెల్లించాలంటూ నెలనెలా విధించే అధిక వడ్డీలతో కూడిన ఈఎంఐ (ఎవ్రీ మంత్ ఇన్‌స్టాల్ మెంట్)ను చెల్లించలేక పేదలు అవస్థలు పడుతున్నారు. రుణభారం మోయలేని కొన్ని కుటుంబాలు రుణ సంస్థల ప్రతినిధుల దూషణలు, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడమో...లేక ఊరి వదిలివెళ్లిపోవడమో చేస్తున్నారు.

● రూ. 10 లక్షలకు రూ.9లక్షలే చేతికి..

రూ. 10 లక్షల రుణం కోసం రూ. 20 లక్షలు విలువ చేసే ఇంటిని తనఖా పెట్టుకుంటున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు.. చివరికి రూ.10లక్షలకు రూ. 9 లక్షలే చేతికి ఇస్తున్నాయి. రూ. లక్ష ఇతర ఖర్చులంటూ వారి వద్దే ఉంచుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రుణం పూర్తిగా ఇవ్వరు. గ్రామ కంఠాలకు చెందిన ఇళ్లకు పంచాయతీ కార్యదర్శి నుంచి ఎన్‌వోసీ పొంది. ఆపై వీఆర్వో ద్వారా సర్వే చేయించుకుని రిపోర్టు తీసుకుని, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకునే క్రమంలో రూ. వేలు ఖర్చవుతున్నాయి. చివరి దశలో రుణ సంస్థల ప్రతినిధులు చెప్పింది వినకపోతే పెట్టిన ఖర్చంతా వృథా అవుతుందని, విధిలేక రుణం తీసుకుం టున్నామని బాధితులు పేర్కొన్నారు.



ఆర్‌బీఐ అనుమతులుంటేనే రుణాలివ్వాలి



ప్రజలు ఎవరిపడితే వాళ్లు ఫైనాన్స్ బిజినెస్ చేయకూడదు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతులున్న సంస్థలు మాత్రమే ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలి. రుణాలిస్తామని ఎవరూ వచ్చినా అగ్రిమెంట్లను పూర్తిగా చదివి, లేదా తెలుసుకున్న తరువాతే సంతకాలు చేయండి. అంతా అయిపోయాక న్యాయం జరగదు. ఫైనాన్స్ సంస్థల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- గుంజి వేణు, నెల్లూరు రూరల్ సీఐ


బ్యాంకుల్లో కఠిన ఆంక్షల వల్లే..

పేదలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకుల్లో కఠినమైన ఆంక్షలు ఉన్నాయి. అందువల్లే వారంతా మైక్రా ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలి. పేదలకు, నిరుపేదలకు సులభంగా రుణాలు అందచేయాలి. అప్పుడే ప్రైవేట్ సంస్థల ఆగడాలు ఆగుతాయి.



- పూడిపర్తి జనార్దన్, సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి

వేధింపులతో దళితుడి బలవన్మరణం



మస్తానయ్య ఇల్లు తనఖాలో ఉన్నట్లు రాసిన హోమ్ ఫైనాన్స్ నిర్వాహకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): అల్లమ్ క్రెడో హోం ఫైనాన్స్ సంస్థ వేధింపులు తట్టుకోలేక, నగర పంచాయతీ పరిధి కట్టుబడిపాళెం దళితవాడకు చెందిన జీ. చిన మస్తానయ్య (70) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, మస్తానయ్య తమ పిల్లల చదువుల కోసం అల్లమ్ క్రెడో హోం ఫైనాన్స్ వారికి ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. రెండేళ్లపాటు రుణం చెల్లించాడు. పిల్లలు చదువులు పూర్తయి ఉద్యోగయత్నాల్లో ఉన్నారు. మిగతా రుణం పిల్లలకు ఉద్యోగం వచ్చిన వెంటనే చెల్లిస్తామని మస్తానయ్య, భార్య మంగమ్మ ఆ సంస్థ వారిని బతిమలాడారు. ఆయన వాళ్లు ససేమిరా అన్నారు. మస్తానయ్య ఇంటి గోడపైన 'ఈ ఇల్లు అల్లమ్‌క్రెడో హోం ఫైనాన్స్‌లో తనఖా ఉంచబడింది, ఈ ఇంటిని రూ. 8లక్షల కు అమ్మబడును' అని రాసి వెళ్లారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మస్తానయ్య శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో దళితవాడలో విషాదం నెలకొంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● సూసైడ్ నోట్ రాసి...

ఫైనాన్స్ కంపెనీవారి ఒత్తిడి తట్టుకోలేకే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు చిన్న మస్తానయ్య ముందుగానే సూసైడ్ రాశాడు. అందులో 'తన చావుకు అల్లమ్ క్రెడో హోం ఫైనాన్స్ కంపెనీ మేనేజరే కారణం.. ఈ సూసైడ్ నోట్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలి. అలాగే డెత్ సర్టిఫికెట్‌ను కడప పీఎఫ్ ఆఫీసులో అందచేయండి. మీకు త్వరగా డబ్బులు వస్తాయి', అని రాసి ఉంది. ఆ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మస్తానయ్య(ఫైల్)



నెల్లూరు నగరంలో నిర్వహించిన అవగాహన ప్రదర్శన

ప్రాణాలు కాపాడేశక్తి అవయవదానానికే ఉంది...

● ఓ వ్యక్తి దానం చేస్తే కొందరి జీవితాల్లో వెలుగు

● అవగాహన సదస్సులో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలను కాపాడేశక్తి అవయవదానానికే ఉందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం జాతీయ అవయవదానం దినోత్సవం సందర్భంగా నెల్లూరులో భారీ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో జీవన్‌దాన్ సంస్థతోపాటు అపోలో, మెడికవర్, కిమ్స్, నారాయణ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆనంద్ పాల్గొని మాట్లాడారు. అవయవదానంపై ప్రజలకు అవగాహన చాలా తక్కువగా ఉందన్నారు. ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపే ఈ గొప్ప కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కలిగించాలన్నారు. దళారుల మాట నమ్మకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవయవదానం చేయాలని జీవన్‌దాన్ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. అనంతరం అవయవ దానానికి ప్రోత్సహించిన వైద్యులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, మెడికవర్ ఆసుపత్రి క్లస్టర్ హెడ్ రంజితరెడ్డి, కిమ్స్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ సతీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దొరసానమ్మ, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీటి విడుదలకు ముందు తెలుగుగంగ కాలువ వద్ద పూజలు చేస్తున్న అధికారులు

కండలేరుకు సోమశిల జలాల విడుదల

అనంతసాగరం ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి కండలేరుకు ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, చైర్మన్ వేలూరు కేశవచౌదరి గంగమ్మకు పూజలు చేసి వాయినం వదిలారు. అనంతరం నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రస్తుతం ఎగువ నుంచి కృష్ణాజలాలు వస్తున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాలతో కండలేరుకు 6,000ల క్యూసెక్కుల నీటిని ఇస్తున్నట్లు చెప్పారు. వరద మట్టం పెరిగితే నీటి విడుదల మోతాదు పెంచుతామని ఆయన తెలిపారు. కాగా సోమశిల జలాశయానికి ఎగవ నుంచి 12,483 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. దీంతో జలాశయ నీటిమట్టం 34.970 టీఎంసీలకు చేరుకుంది. ఉత్తరకాలువకు 370, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● నీటి విడుదలపై హెచ్చరికలేవీ?

సోమశిల నుంచి దిగువకు నీరు వదిలే ప్రతిసారి ఇంజనీర్లు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నీటి విడుదలకు ముందు డెల్టా, నాన్‌డెల్టా పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేయాలి. ముందుగానే పత్రికలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పిస్తే ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదాలు జరుగకుండా చూడవచ్చు. అయితే అదిశగా ఇంజనీర్లు సమాచారం ఇవ్వడం లేదు. కేవలం సైరన్ మోగించి నీటిని విడుదలకు ఉపక్రమిస్తున్నారు. ఆసైరన్ శబ్దం కేవలం సోమశిలకు మాత్రమే పరిమితమవుతోంది.

రుణాలు ఎప్పుడిస్తారో..?

● సబ్సిడీ లోన్ల మంజూరుకు బ్రేకులు

● దరఖాస్తులు స్వీకరించాక అడ్డంకులు

● నాలుగు నెలలుగా ముందుకు పడని అడుగు

● నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం ● నిరీక్షిస్తున్న వేలాదిమంది పేదలు

నెల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఒకటికాదు... రెండు కాదు... ఏకంగా ఐదేళ్ల తర్వాత రాయితీ రుణాల మంజూరుకు ప్రకటన వెలువడడంతో పేదలంతా ఆనందపడ్డారు. వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన సబ్సిడీ రుణాల పథకాన్ని తిరిగి కూటమి ప్రభుత్వం ప్రారంభించడంతో నిరుద్యోగుల్లోనూ ఆశలు చిగురించాయి. ఊహించిన దానికంటే అధికంగా దరఖాస్తులు కూడా వచ్చాయి. అయితే ఏమైందోకానీ ఈ ప్రక్రియను నిలిపేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఇది జరిగి నాలుగు నెలలు గడిచింది. ఒకసారి ప్రభుత్వం నుంచి అనుమతి లభించి, దరఖాస్తులు కూడా స్వీకరించాక, ఎందుకు అడుగు ముందుకు పడలేదు..? అంటే ఎవరికీ స్పష్టత లేదు. తమకు రుణాలు ఎప్పుడు మంజూరవుతాయని దరఖాస్తుదారులు అడిగితే.. ఎవరూ చెప్పలేని పరిస్థితి.

● ఐదేళ్ల తర్వాత మంజూరు

సొంతకాళ్ల మీద నిలబడాలనుకునేవారికి రాయితీ రుణాలు ఎంతో ఉపయోగకరం. ఇందులో 40 నుంచి 60 శాతం వరకు సబ్సిడీ ఇస్తుండడంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం రాకముందు ప్రతీ కుల కార్పొరేషన్ ద్వారా ప్రతీ ఏటా రాయితీ రుణాలు అందిస్తూ వచ్చారు. అయితే వైసీపీ పాలనలో మాత్రం ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సబ్సిడీ రుణాల జాతర మొదలైంది. జిల్లాలో ఒక్క ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 1240 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.51.81 కోట్లతో అనుమతులు ఇచ్చింది. అందులో రూ.20.46 కోట్లను రాయితీ కింద అందిస్తుండగా, మరో రూ.28.75 కోట్లను బ్యాంకు రుణంగా సమకూర్చనున్నారు. మిగిలిన ఐదుశాతం అంటే రూ.2.59 కోట్లను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. రూ.3 లక్షలలోపు రుణాలు 226 ఉండగా వీటికి 60 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అలానే రూ.3 లక్షల నుంచి 10 లక్షల వరకూ ఉన్న యూనిట్లు 628 ఉండగా వీటికి 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. ఇవి గాక ఆటోలు, ట్రక్కులు, కార్లు, ఇతర వాహనాలు కూడా మంజూరు చేస్తుండగా వీటికి 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అదే విధంగా బీసీ కార్పొరేషన్ కింద 1328 యూనిట్లు, మిగిలిన ఎనిమిది కార్పొరేషన్లకు కలిపి 801 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో కూడా 50 శాతం వరకు సబ్సిడీ రుణాలున్నాయి.

● భారీగా దరఖాస్తులు

బీసీ కార్పొరేషన్ అధికారులు 2024-25 సంవత్సరానికి రుణాలు మంజూరు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. 1328 యూనిట్ల కోసం ఏకంగా 14973 మంది దర ఖాస్తులు చేసుకున్నారు. అంటే సరాసరి ఒక యూనిట్ కోసం పదిమందికి పైగా పేదలు పోటీ పడ్డారు. అలానే రెడ్డి కార్పొరేషన్ కింద 161 యూనిట్లకు గానూ 545 మంది, కాపు కార్పొరేషన్ కింద 231 యూనిట్లకు 1830 మంది, వైశ్య కార్పొరేషన్ కింద 47 యూని ట్లకు 329 మంది, కమ్మ కార్పొరేషన్ కింద 115 యూనిట్లకు 411 మంది, ఈబీసీ కార్పొరేషన్ కింద 105 యూనిట్లకు 541 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్పొరేషన్ల పరిధిలోని యూని ట్లన్నింటికీ దరఖాస్తులను స్వీకరించి, అర్హులను కూడా ఎంపిక చేశారు. ఇక ఎస్సీ కార్పొరేషన్ కింద 1240 యూనిట్లకు సుమారు 12 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. ఈ యూనిట్లకు దరఖాస్తుల స్వీక రణ సమయంలోనే బ్రేకులు పడ్డాయి. ఇక 2025-26 సంవత్సరానికిగానూ మైనారిటీ కార్పొరేషన్ కింద జిల్లాకు 1449 యూనిట్లు మంజూర య్యాయి. ప్రస్తుతం వీటికి దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన సబ్సిడీ యూనిట్లకు మంజూరు ప్రక్రియ నాలుగు నెల లుగా నిలిచిపోయింది. కొన్ని దర ఖాస్తులు ఎంపీడీవోల లాగిన్లలో, మరికొన్ని కలెక్టర్ లాగిన్ స్థాయిలో ఆగిపోయాయి. రాష్ట్ర ఉన్నతాధికా రుల నుంచి ఆదేశాలు వస్తేగానీ రుణాల ప్రక్రియ ముందుకు సాగ దు. దీంతో ఇంకెన్నాళ్లు వేచి చూడాలోనన్న ఆందోళన దరఖాస్తుదారుల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. వీటిలో చాలావరకు పరిశీలన కూడా చేశాం. వీటన్నింటిని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో అక్కడి నుంచి ఉత్తర్వులు రానున్నాయి. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తాం.

- నిర్మలా దేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

చీపురు పట్టిన బీసీ సంక్షేమాధికారి

ఒక్కరోజులో జిల్లాలోని వసతిగృహాలు శుభ్రం

రాష్ట్రాధికారుల ఆదేశాలతో కార్యక్రమం నిర్వహణ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నతాధికారులు తలచుకుంటే ఏపనైనా చేయగలరని నిరూపించారు. జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ హాస్టళ్లు చెత్తాచెదారాలతో నిండి ఉండటాన్ని వారు గుర్తించారు. వెంటనే స్పందించారు. మెగా క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ చీపురు పట్టి నగరంలోని భక్తవత్సల్ నగర్ బీసీ బాలికల హాస్టల్‌ను శుభ్రం చేశారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు కూడా ఆమెతో జతకలిశారు. హాస్టల్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆ హాస్టల్‌లోని అన్నీ గదులను, మరుగుదొడ్డను, వంటసామగ్రిని శుభ్రం చేయించారు. స్టోర్‌రూమ్‌లో నిత్యావసర సరుకులను ప్లాస్టిక్ డబ్బాల్లో భద్రపరిచేలా ఏర్పాటు చేశారు. ఆ డబ్బాలపై ఆయా సరుకుల వివరాలు తెలిపే లేబుళ్లను వేయించారు. అనంతరం విద్యార్థినులకు పరిశుభ్రత గురించి వివరించారు. విద్యార్థినులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అలాగే హాస్టల్‌కు మంచి పేరు తీసుకుని రావాలని ఆమె కోరారు. 10వ తరగతి విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించి, వారు మంచి మార్కులు సాధించేలా చూడాలని హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. జిల్లా అధికారే స్వయంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొనడంతో జిల్లాలోని అన్నీ హాస్టళ్లలో వెల్ఫేర్ అధికారులు కూడా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



నగరంలోని భక్తవత్సలనగర్‌లో హాస్టల్ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ

సిట్ కస్టడీకి కాకాణి

భూరికార్డుల తారుమారుపై విచారించిన అధికారులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆదివారం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని కాకుటూరు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పట్టా భూములుగా రికార్డులు మార్చిన కేసులో ఆయన రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు అనుమతితో సిట్ డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం కస్టడీలోకి తీసుకుని నెల్లూరు డీటీసీకి తరలించారు. ప్రభుత్వ భూములను పట్టాభూములుగా మార్చడంలో మీ ప్రమేయం ఉందికదా...? మీ ప్రోత్సాహంతోనే రికార్డులు మార్చారు... అందుకు మా వద్ద సాక్ష్యాలు ఉన్నాయి.. ఇందుకు మీరేమంటారు...? అని సిట్ అధికారులు కాకాణిని ప్రశ్నించారు. అందుకు ఆయన 'నాకేమీ తెలియదు, సంబంధం లేదు' అని తెలిపినట్లు సమాచారం. ఇలా 25కిపైగా ప్రశ్నలు వేయగా, ఆయన ఏ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది. సోమవారం కూడా సిట్ పోలీసులు ఆయన్ను విచారించనున్నారు.

ఏటీఎం కార్డుల దొంగ అరెస్ట్

వివరాలు 8లో

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100) : 475

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ.117.20

భక్తిశ్రద్ధలతో సువాసినీ పూజలు

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : నగరంలో పొగతోటలోని ఆదిశంకరా ధ్యాన మందిరంలో ఆదివారం లలిత సహస్రనామ కుంకుమపూజ, సువాసినీ పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆదిశంకరాచార్యులు, ఉపాచార్యులకు విశేష పుష్పాలంకారం, పూజలు జరిగాయి. లక్ష్మీకామాక్షి భక్త బృందం, బాలాజీనగర్ మహిళా మండలి లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ చేశారు. మందిరం కమిటీ అధ్యక్షుడు చక్రాల ఆనందకుమార్, గుండా పంతుల సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షించారు. మందిరం మేనేజర్ సమయానందస్వామి ఎం లక్ష్మీనరసింహారావు, పీవీ ప్రసాద్, వంకా శ్రీహరి, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

● ఎస్బీఐ ఎస్‌యూఏసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్బీఐ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయమని, అందుకోసం అహర్నిశలు శ్రమిస్తామని ఎస్బీఐ ఎస్‌యూఏసీ ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని టౌన్ బ్రాంచిలో సంఘం రీజినల్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్బీఐ ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి విభాగం అధ్యక్షుడు వీవీ ప్రసాద్, నెల్లూరు రీజియన్ మేనేజర్ పీ మురళి నాయక్, తిరుపతి విభాగం ఉప ప్రధాన కార్యదర్శి కేవీఎస్ఎన్ మూర్తి, ఎస్బీఐ యూనియన్ సీనియర్ నాయకుడు మనోజ్ పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వాకర్స్ స్నేహితుల దినోత్సవం

నెల్లూరు(విద్య), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. వాకర్స్‌కు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షకార్యదర్శులు చింతల అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా చెక్కుచెదరని స్నేహంతో అందరం కలిసి వాకర్స్‌కు సేవలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి జీకే గోపీనాథ్, నాయకులు రాఘవేంద్రషెట్టి, డీవీ సుబ్బరాజు, నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ సోషల్ జస్టిస్ కార్యవర్గం ఏర్పాటు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వాయిస్ ఆఫ్ సోషల్ జస్టిస్ అనే సంస్థ నూతన కార్యవర్గాన్ని ఆ సంస్థ ఛైర్మన్, వ్యవస్థాపకుడు జీ చంద్రకుమార్ ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంస్థను మే 13న ఢిల్లీలో రిజిస్టర్ చేశామన్నారు. అన్నీ రాష్ట్రాలకు దీనిని విస్తరించి అందరికీ సమన్యాయం కోసం కృషి చేస్తామని తెలిపారు. జాతీయ కోర్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా సీహెచ్ శ్రీనివాసరెడ్డి (తెలంగాణ), జాతీయ అధ్యక్షుడిగా బాలాజీ శంకర్‌సింగ్ (ఆంధ్రప్రదేశ్, కాకినాడ), కార్యదర్శిగా ఎన్ ఉషారాణి (తెలంగాణ), ఉపాధ్యక్షులుగా వై రఘు(కర్ణాటక), సందీప్‌కుమార్ (ఢిల్లీ), కార్యదర్శులుగా టీ సూరజ్‌సింగ్ (హిమాచల్‌ప్రదేశ్), విజయకుమార్ (చెన్నై), ఎం చైతన్యకుమార్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ట్రెజరర్ కమ్ లీగల్ అడ్వైజర్‌గా బీ ఆంజన్‌సింగ్, సభ్యులను పరిచయం చేశారు.

ఉన్నది పాయే... కొత్తది రాదాయే!!

● పెన్నా వంతెన నిర్వాసితుల అవస్థలు

● పట్టాలిచ్చిన భూమిలో కోర్టు కేసులంటూ బోర్డులు

● ఇళ్లు నిర్మించుకోలేక ఆందోళన

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పెన్నా వంతెన నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకవైపు ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఇళ్లను కోల్పోయి..... మరోవైపు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో నివాసాలు కట్టుకోలేక వందలాది కుటుంబాలు త్రిశంకు స్వర్గంలో ఉండిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి... నెల్లూరు నగరంలో పెన్నానదిపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ కమ్ రోడ్డు కోసం శెట్టిగుంట రోడ్డు, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లోని వందలాది మంది నివాసాలను కోల్పోయారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపింది. వెంకటేశ్వరపురం జనార్దన్ రెడ్డికాలనీ ప్రాంతంలో సర్వే నెంబరు 2221లో 140 మంది లబ్ధిదారులకు 12 అంకణాల చొప్పున హద్దులు వేసి స్థలాలకు పట్టాలు ఇచ్చింది. అయితే ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకుందామని వెళితే అక్కడ హెచ్చరిక బోర్డులు దర్శనమిచ్చాయి. 'ఈ వ్యవసాయ భూమి కోర్టు కేసులో ఉన్నది' అంటూ ఆ ప్రాంతంలో బోర్డులు ఏర్పాటు చేసి ఉన్నారు. దీంతో ఇటు ఉన్న ఇళ్లు కోల్పోయి.. అటు కొత్త ఇళ్లు కట్టుకోలేక లబోదిబోమంటున్నారు. ఇంత జరుగుతున్నా వారికి పట్టాలు పంపిణీ చేసిన రెవెన్యూ అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.



నిర్వాసితులకు ఇచ్చిన స్థలాలు, వాటిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



వంతెన నిర్మాణం కోసం తొలగిస్తున్న ఇళ్లు (ఫైల్)

పొలం యజమానులకు పరిహారం చెల్లించాం

పొలం యజమానులకు చాలా కాలం క్రితమే ప్రభుత్వం పరిహారం నగదు చెల్లించి ఆ భూమిని కొనుగోలు చేసింది. అయినా కొందరు అత్యాశకుపోయి కోర్టుకు వెళ్లారు. హైకోర్టులో ఆ కేసులను కొట్టేసి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. అయినప్పటికీ బోర్డులు పెట్టడం చట్టరీత్యా నేరం అవుతుంది. వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాము. లబ్ధిదారులు వారికిచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవచ్చు.

- షఫీమాలిక్, అర్బన్ తహసీల్దార్

ఆశ్రయించిన వారికి న్యాయం చేయండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్



సత్కారం అనంతరం న్యాయవాదులతో జిల్లా జడ్జి శ్రీనివాస్ తదితరులు

నెల్లూరు (లీగల్), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కోర్టును ఆశ్రయించిన వారికి న్యాయం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ న్యాయాధికారులు, న్యాయవాదులకు సూచించారు. ఇటీవల నెల్లూరు బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో వీసీఎస్ఆర్ ప్యానల్ నుంచి పోటీ చేసి గెలిచిన వారికి ఆదివారం అభినందన సభ నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయాధికారి మాట్లాడుతూ జిల్లా కోర్టులో ఉన్న పాత భవనం త్వరలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోనున్నదని, లిఫ్ట్ కూడా సిద్ధమవుతోందని, ఇందుకోసం రాష్ట్ర హైకోర్టు నిధులు కేటాయించిందని చెప్పారు. న్యాయస్థానం ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ సౌజన్యంతో ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో వీసీఎస్ఆర్ ప్యానెల్ విజయానికి సహకరించిన అందరికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పులిమి అయ్యప్ప రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, సంయుక్త కార్యదర్శి కేఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో విజేతలను సత్కరించారు.

బాలయ్య అభిమానుల సంబరాలు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ తెలుగు సినిమా కేటగిరిలో ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి చిత్రానికి జాతీయ అవార్డు రావటంతో ఆదివారం ఆయన అభిమానులు సంబరాలు చేశారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితోపాటు నగరంలోని నర్తకి సెంటర్‌లో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కోటంరెడ్డి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన నటుడు బాలకృష్ణ అని కొనియాడారు. హైదరాబాద్‌లో బసవతారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా నిరుపేదలకు మంచి వైద్యాన్ని అందిస్తున్న బాలకృష్ణ, రాష్ట్ర రాజధాని అమరావతిలోనూ ఆసుపత్రి నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఊపిరి ఉన్నంత వరకు బాలకృష్ణ వెంటే నడుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు ఎద్దల రవి, టీడీపీ, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుడా ఛైర్మన్ కోటంరెడ్డి, బాలకృష్ణ అభిమానులు

రక్తదాన శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గణేష్ సేవా మిత్ర మండలి ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నోవా బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. మిత్రమండలి సభ్యులు, యువకులు రక్తదానం చేశారు. విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. రక్తనిధి ప్రతినిధి మోపూరు భాస్కర్‌నాయుడు, మిత్రమండలి అధ్యక్షుడు గాలి శ్రీధర్, కోవూరు ప్రసాద్, రాజేష్, హర్ష, శ్రీను, వినయ్ పాల్గొన్నారు.

వెన్నెలకంటి వేణుగోపాల రావు సేవలు ఘనం

● సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ రమణారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖలో 35 ఏళ్లు పనిచేసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఉద్యోగ విరమణ పొందిన వెన్నెలకంటి వేణుగోపాల రావు సేవలు ఘనమైనవని సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ బీవీ రమణారెడ్డి కొనియాడారు. ఆదివారం వేణుగోపాలరావు, ఉషారాణి దంపతులకు నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభ జరిగింది. రమణారెడ్డి మాట్లాడుతూ వేణుగోపాల రావు జలవనరులశాఖ ప్రధాన సర్కిల్‌లో 21 సంవత్సరాలపాటు తన అనుభవంతో అధికారులను మెప్పిస్తూ, రైతుల మన్ననలు చూరగొన్నారన్నారు. వేణుగోపాల రావు మాట్లాడుతూ శాఖలో అందరి అభిమానం పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఈ బాబురావు, డీఈఈలు కే విజయభాస్కర్‌రెడ్డి, పెంచలయ్య, సత్యప్రసాద్, మున్సిపల్ ఇంజనీరు టీ రఘురాం, విశ్రాంత బ్యాంకు అధికారి యడవల్లి వెంకట సుబ్బారావు, విశ్రాంత ఏజీపీ ఫణిరత్నం, దివ్య పావని, శ్రీచరణ్, శ్రీవర్ష, మారుతీ దిలీప్, చంద్రరేఖ తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాల రావును సత్కరిస్తున్న ఎస్ఈ రమణారెడ్డి తదితరులు

చర్మవ్యాధుల వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీ చైతన్య క్లినిక్‌లో ఆదివారం చర్మవ్యాధు లు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బొల్లి, సోరియాసిస్, ముఖం మీద మచ్చలు, మొటిమలు, మంగు, ఆనెలు వంటి సమస్యలతో బాధపడుతున్న వారిని వైద్యులు పరీక్షించి మందులు అందచేశారు. చర్మవ్యాధులు వైద్య నిపుణుడు డాక్టర్ కేఎస్ రాజు మాట్లాడుతూ చర్మ వ్యాధులకు, జట్టు, సుఖ వ్యాధులకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ అశోక్, డాక్టర్ మల్లికార్జున, కొండా శివారెడ్డి, శివయ్య, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరిదేవికి పూలంగిసేవ

ఇందుకూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో వేంచేసివున్న శ్రీచాముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం రెండో ఆదివారం సందర్భంగా అమ్మవారికి పూలంగిసేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా రామతీర్థం వాస్తవ్యులు తంబి రాజా, ప్రవళికలు వ్యవహరించారు. 8న వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీఅమ్మవారికి విశేషంగా పసుపు కొమ్ములతో అలంకారం, భక్తులచే సామూహిక కుంకుమార్చన జరుగుతుందని కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు తెలిపారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా చిరంజీవి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాల సమర్పించారు. ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల, పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. విద్యార్థు లకు మహాత్మాగాంధీ జీవిత విశేషాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొడవలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడవలూరు, రాజుపాలెం ప్రధాన కూడలిలో ఎస్ఐ కోటిరెడ్డి ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించి, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

ఇందూ ధర్మ ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 16న శ్రీ కృష్ణజన్మాష్టమి పర్వదినం సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నెల్లూరు కమిటీ అధ్వర్యంలో ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించాలన్నారు. భగవంతుడే శ్రీకృష్ణపరమాత్ముడని స్థానిక ప్రజలకు ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ప్రబోధ సేవా సమితి సభ్యులు సురవౌళి, ప్రవీణ, సురేంద్ర, అవినాశ్, శేఖర్, శ్రీదేవి, విజయమ్మ, ప్రదీప్, నిగమశ్రీ, కల్పన, సుదర్శనమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆకుపచ్చని' సంకల్పం!

● పంట కాలువ ఒడ్డున పరచుకున్న పచ్చదనం

● దేవుళ్ల పేర్లతో పూల మొక్కల పెంపకం

● నీళ్లు పోసి కాపాడుతున్న వృద్ధుడు చంద్రయ్య



మొక్కలకు నీళ్లు పోస్తున్న వృద్ధుడు చంద్రయ్య

పొదలకూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆ వయో వృద్ధుడి 'ఆకుపచ్చని' సంకల్పం ఎందరికో ఆదర్శం. ఆయన వయసు 85 ఏళ్లు. మొక్కల పెంపకమంటే ఆయనకు ప్రాణం. కన్నబిడ్డల కన్నా ఎక్కువగా మొక్కలను పెంచుతున్నాడు.. చెత్తచెదారాలతో ఉన్న పొదలకూరు ప్రధాన పంట కాలువ ఒడ్డును నేడు పచ్చదనంతో నింపాడు. పలు రకాల మొక్కలను తానే స్వయంగా నాటి పచ్చదనాన్ని పెంచుతూ నేటి యువతకు మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేస్తున్నాడు. ఆరు నెలలు గా పంట కాలువ పక్కన వివిధ పూలు, పండ్ల మొక్కలు, కూరగాయల మొక్కలను పెంచు తుండడంతో అక్కడ పచ్చదనం పరచుకుంది.

శభాష్.. చంద్రయ్యా..!

పొదలకూరు పట్టణంలోని టైలర్స్ కాలనీలో 85 ఏళ్ల మద్దె చంద్రయ్య నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. అందరికీ పెళ్లిళ్లు చేసేశాడు. వ్యవసాయం చేసిన అనుభవంతో ఖాళీగా ఉండలేక టైలర్స్ కాలనీ సమీపంలో ఉన్న పంట కాలువ ఒడ్డున అర కిలోమీటర్ పొడవున పచ్చదనంతో నింపాలనుకున్నాడు. ఆధ్యాత్మికతను ఎంతో ఇష్టపడే ఆయన.. అదే ఆసక్తితో వివిధ దేవతా మూర్తుల పేర్లతో జమ్మి, ఉసిరి, మామిడి, మునగతో పాటు పలు రకాల పూల మొక్కలను నాటాడు. ప్రతీరోజు వాటికి నీళ్లు పోసి సంరక్షిస్తూ పచ్చదనాన్ని పెంపొందిస్తున్నాడు. పశువులు, మేకలు ఆ మొక్కలను తినకుండా చుట్టూ కంచె వేసి కాపలా కాస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంటాడు. గతంలో ఈ పంట కాలువ ఒడ్డున చుట్టుపక్కల వారు చెత్తాచెదారం వేసేవారు. ఇప్పుడు ఆ ప్రాంతం చంద్రయ్య సంకల్పంతో పచ్చదనంతో నిండిపోయింది. 85 ఏళ్ల వయసు లో కూడా చెట్లపైన అయనకున్న మమకారాన్ని చూసి పలువురు తన కృషిని అభినంది స్తున్నారు. నేటి యువత ఖాళీ సమయాల్లోనూ, సెలవు దినాల్లోనూ మొక్కల పెంపకం, వ్యవ సాయం పైన ఆసక్తిని కలిగి ఉండాలని వారిలో పర్యావరణంపై చైతన్యం నింపుతున్నాడు.

నేను ఉన్నా లేకున్నా... మొక్కలు శాశ్వతం

ఆ రోజుల్లో మన తాత, ముత్తాతలు పెంచిన చెట్ల వల్ల ఈ రోజు మనం వాటి ఫలాలను అనుభవిస్తున్నాం. అలాగే మనం నాటే మొక్కలు రాబోయే తరాలకు ఉప యోగపడతాయి. నేనున్నా లేకున్నా నేను నాటిన ఈ మొక్కలు శాశ్వతంగా ఉంటాయి. అందుకే నేను ఖాళీగా ఉన్న పంటకాలువ ఒడ్డున మొక్కలు పెంచుతున్నాను. ఉదయం, సాయంత్రం ఆ మొక్కలకి నీళ్లు పోసి సంరక్షించడం వల్ల మొక్కలు పూలు పూస్తున్నాయి. కాయలు కాస్తున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

- మద్దె చంద్రయ్య, వృక్ష ప్రేమికుడు, పొదలకూరు

వాలీబాల్ కిట్ పంపిణీ

మనుబోలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జట్లకొండూరులో వాలీబాల్ క్రీడాకారులకు ఆ గ్రామ ఉపసర్పంచు అవుల తులసీరామ్ యాదవ్ ఆదివారం వాలీబాల్ కిట్‌ను అంజేశారు. ఈ సందర్భంగా అవుల మాట్లాడుతూ చెడువ్యసనాలకు దూరంగా ఉండి, నచ్చిన క్రీడల్లో బాగా ప్రతిభచూపాలని, గ్రామపంచాయతీకి మంచిపేరు తీసుకురావాలన్నారు.



కిట్ అందిస్తున్న తులసీరామ్

కూచిపూడి కళాక్షేత్రం ఏర్పాటు అభినందనీయం

మనుబోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ నృత్య కళల్లో ఒకటైన కూచిపూడిని నేటి తరానికి పరిచయం చేసి, శిక్షణ ఇచ్చేందుకు కళాక్షేత్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ శివరాకేష్ అన్నారు. స్థానిక కోదండ రామపురంలో ఆదివారం ప్రముఖ నాట్యగురువు డేగల సాంబశివ రావు ఆధ్వర్యంలో మడమనూరు కూచిపూడి నాట్యాచారిణి పృథ్వీ పూర్ణిమశ్రీ శిక్షణలో నిర్వహించే సిద్దేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్రాన్ని ఎస్ఐ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాట్యాచారిణిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం ఎస్ఐని నిర్వాహకులు పృథ్వీ, మల్లికార్జున శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు, మడమనూరు గ్రామాల రాజకీయ నాయకులు, పెద్దలు, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శివరాకేష్

కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టుతో ఆంధ్ర, తెలంగాణకు నష్టం

బీజేపీ నేత మిడతల రమేష్


పొదలకూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టు వలన తెలంగాణా, ఆంధ్రా నీటి హక్కులు కోల్పోతున్నాయని బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. ఆదివారం పొదలకూరులోని జమునా హాల్ సెంటర్‌లో ఆయన జల వివాదాలపై స్పందించారు. కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల కోల్పోతున్న కృష్ణా జలాల హక్కులపై కర్ణాటకను తెలంగాణా మంత్రులు ఎందుకు ప్రశ్నించరన్నారు. శ్రీశైలం ముందుభాగంలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను తెలంగాణా ప్రభుత్వం కేవలం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మాత్రమే వినియోగించుకోవాల్సి ఉందన్నారు. వృథాగా సముద్రంలోకి వెళ్తున్న గోదావరి జలాలను కృష్ణా జలాలకు తరలిస్తే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణా ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వాస్తవ విరుద్ధంగా తెలంగాణా మంత్రులు నీటి హక్కుల పోరాటం చేస్తున్నారని రమేష్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాచపూటి ధనుంజయరావు, చింతగింజల సుబ్రహ్మణ్యం, నలగర్ల వెంకటేశ్వర్లు, సన్నిగంటి శ్రీనివాసులు, జయమూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిడతల రమేష్

కోన నిత్యాన్నదాన పథకానికి రూ. 50 వేల వితరణ

రాపూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రాపూరు పట్టణానికి చెందిన సిద్ధలయ్య సెంట ర్‌లోని ప్రొవిజన్ షాపు యజమాని విచ్చన్నగిరి గురవయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతులు ఆదివారం రూ. 50 వేలు విరాళం ఇచ్చారు. ఈ నగదును కోనలో ఆలయ సిబ్బందికి అందజేశారు. దేవస్థానం అధికారులు వారికి స్వామి, అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లో దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



నగదు అందజేస్తున్న గురవయ్య దంపతులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదానీతో ఒప్పందం చేసుకుని వ్యవసాయ పంపుసెట్లకు, గృహ అవసరాలకు ఇంటింటికీ ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, దీనిని సీపీఎం వ్యతిరేకిస్తోందని నాయకులు గరికపాటి సురేష్, పుత్తేటి మల్లికార్జున, మద్దిశెట్టి సురేష్, విస్స మునస్వామి ఆదివారం తెలిపారు. ఈనెల 7వతేదీ వరకు బుచ్చి, సంగం మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లవద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుచ్చి మండలంలోని పలు గ్రామాలలో ఆటోతో ప్రచారం చేపట్టింది.

మురళీకృష్ణకు జ్యోతిష్య ప్రవీణ పురస్కారం

ముత్తుకూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరుకు చెందిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ జ్యోతిష్య ప్రవీణ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆదివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ 31వ సువర్ణ కంకణ పురస్కార సంబరాల సందర్భంగా ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేసి, స్వర్ణ కంకణంతో సత్కరించారు. సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ, లలిత కళా సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీ మండలి సభ్యులు రుద్రరాజు పద్మనాభ రాజు చేతుల మీదుగా మురళీకృష్ణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్య బ్రహ్మ జెన్నీ, జ్యోతిష్య శాస్త్రవేత్త కర్రా వీరభద్రం, విద్యావేత్త రాజగోపాల్‌రెడ్డి, సినీ నటుడు శివాజీరాజా తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీలో నెర్రెలు బారి దెబ్బతిన్న సిమెంట్‌రోడ్డు

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా..

పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో సిమెంట్ రహదారి నెర్రెలు బారి ఛిద్రమవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో అయితే పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు రహదారిపై మురుగు ప్రవహిస్తుండడంతో అడుగు ముందుకు వేయలేకపోతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

కండలేరు ఎడమ కాలువకు జలకళ

లిఫ్ట్ ద్వారా కెనాల్‌కు నీటి విడుదల



లిఫ్ట్ ద్వారా ఎడమ కాలువకు చేరుతున్న నీరు

పొదలకూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో కండలేరు ఎడమ కాలువకు జలకళ వచ్చింది. కండలేరు జలాశయంలో నీటిమట్టం తగ్గిపోవడంతో ఎడమ కాలువలో కొద్దిరోజులుగా ప్రవాహం లేక వరిపైర్లు, నిమ్మతోటలతోపాటు పశువులకు తాగునీరు లేక రైతులు ఇక్కట్లు పడ్డారు. ఈ సమస్యను పొదలకూరు మండల టీడీపీ నాయకుల ద్వారా రైతులు ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్‌కు విద్యుత్ సరఫరాను అందించే ట్రాన్స్‌ఫార్మర్ పిడుగుపాటుకు గురవడంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయని అధికారులు తెలిపారు. ఈ సమస్యను ఇటీవల డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో జిల్లా కలెక్టర్ ఆనంద్ నిధులు మంజూరు చేశారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతోపాటు మోటార్లకు సర్వీస్ చేయించి ఆదివారం కాలువకు లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు. పంటలను సకాలంలో కాపాడిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొదలకూరు మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, ఇరిగేషన్ ఈఈ అనిల్‌కుమార్ రెడ్డి, డీఈ వెంకట్రామి రెడ్డి, జేఈ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్ రెడ్డి, దేవినేని శరత్, పులిపాటి వెంకటేశ్వర్లు, ఎత్తపు వెంకటరెడ్డి, వెన్నపూస శ్రీనివాస్‌రెడ్డి, మలిరెడ్డి ఓబులరెడ్డి, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కసుమూరులో

భక్తుల సందడి

వెంకటాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతోపాటు ఏపీ నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ వలి దర్గాను దర్శించుకున్నారు. కొందరు భక్తులు షాఫాబావిలో పుణ్య స్నానాలు ఆచరించి మస్తాన్ స్వామి వారిని దర్శించుకున్నారు. మరికొందరు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా, కొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



సదస్సులో మాట్లాడుతున్న సుధాకర్‌రావు

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పని చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో అసోసియేషన్ సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు ఉద్యోగోన్నతి పొందకనే రిటైర్డ్ అవుతున్నారని, వెంటనే వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్లకు టైం బౌండ్ లేకుండా ఉద్యోగోన్నతులు కల్పించాలని, అలాగే కార్యాలయ సబార్డినేట్లకు కూడా సకాలంలో ఉద్యోగోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా గౌరవాధ్యక్షురాలు ఇందిరా, గౌరవ సలహాదారు అరవ పరిమళ, అసోసియేట్ అధ్యక్షుడు నారాయణరాజు, కోశాధికారి శేషగిరిరావు, రాజయ్య, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు అరికట్టేందుకే...

10 తర్వాత నుంచి అమలు

శ్రామికుల హాజరు... ఇక పక్కా..!

ఉదయగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంపై ఇప్పటివరకు అధికారులు గ్రామసభలు, సామాజిక తనిఖీలు నిర్వహించేవారు. వాటిల్లో బినామీవ్యక్తులకు మస్టర్లు వేసి క్షేత్ర సహాయకులు నిధులు స్వాహా చేశారనే విషయం వెల్లడయ్యేది. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పథకం అమల్లో నేషనల్ మొబైల్ మానటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్ యాప్)ను తీసుకురానున్నది. ఇది బినామీ వ్యక్తుల హాజరు నమోదుకు అడ్డుకట్ట వేసేందుకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సుమారు 3.66 లక్షల జాబ్‌కార్డులను పొంది ఉపాధి పనులకు శ్రామికులు అర్హులుగా ఉన్నారు. అయితే వీరిలో 2.68 లక్షల జాబ్‌కార్డుదారులే పనులకు హాజరవుతున్నారు. వీరికి ఈనెల 10వతేదీ తరువాత ఈ యాప్ ద్వారా హాజరు నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులు(ఫైల్)

- నిబంధనలు ఇలా..

ఎస్ఎంఎంఎస్ యాప్‌లో మొదటిసారి హాజరు ఫొటోను నమోదు చేసిన 4 గంటల తరువాత రెండోసారి తప్పనిసరిగా చేయాలి. అప్‌లోడ్ సమస్య ఎదురైతే ఫొటోను సేవ్ చేసి అదే రోజు రాత్రి 12 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలి. మాన్యువల్ మస్టర్ అప్రూవల్‌కు సరైన కారణం చూపాలి. రెండోసారి హాజరు పంపని క్షేత్ర సహాయకుడు, సీనియర్ మేటీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యాప్ తొలగించి తిరిగి ఇన్‌స్టాల్ చేయకూడదు. వేతనదారుల ఫొటోలు ఒక విడత మాత్రమే నమోదు చేస్తే మరుసటి రోజు నమోదుకు అవకాశం ఉండదు.

అక్రమాలకు అడ్డుకట్ట

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిప్రదేశంలో హాజరైన శ్రామికులకు తప్పనిసరిగా రెండుసార్లు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం వల్ల బినామీ మస్టర్లకు అడ్డుకట్ట వేయవచ్చు. దీనిపై ఇప్పటికే జిల్లా స్థాయిలో అధికారులకు శిక్షణ పూర్తయ్యింది. త్వరలో క్లస్టర్‌స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇస్తాం. ఈనెల 10 తరువాత ఈ విధానం అమల్లోకి వస్తుంది.



- గంగాభవాని, ప్రాజెక్టు డైరెక్టర్



విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

- విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాల ధర్నా

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై ఆర్థిక భారం మోపే విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు ఆపాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం నెల్లూరులోని కోటమిట్ట విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ముందుగా చేపల మార్కెట్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. సీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్, సీపీఐ నగర సహాయక కార్యదర్శి సిరాజ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ నాయకుడు యానాదయ్య, ఎస్‌యూ సీఐ పార్టీ నాయకుడు బసవరాజులు మాట్లాడారు. విద్యుత్ పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉందని, దానిని ఆదాని వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి స్మార్ట్ మీటర్లను రంగంలోకి తెస్తున్నారని విమర్శించారు. దీనివ ల్ల పగటి పూట యూనిట్‌కు ఒక రేటు, రాత్రిపూట మరో రేటు వంతున అక్రమార్జనకు దారితీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నెత్తిన గుదిబండగా మారే స్మార్ట్ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేశారు. వెంటనే వాటిని రద్దు చేసి, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో షేక్ ఫయాజ్, హుమయూన్, ఇస్మాయిల్, అజీజ్, షాన్‌వాజ్, అశోక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలకు హాజరైన బాలబాలికలు



శ్రీకృష్ణుడు, రాధ తదితర వేష ధారణలో చిన్నారులు

ఇస్కాన్ సాంస్కృతిక పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం చిన్నారులకు శ్లోక కంఠస్థ పోటీలు, కలరింగ్, ఫ్యాన్సీ డ్రెస్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల దేవతామూర్తుల వేషధారణల్లో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సతీమణి ప్రవీణ హాజరై చిన్నారులను అభినందించారు. మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 16వతేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల విజేతలకు 16వతేదీ బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

గురుకులంలో 5వ తరగతిలో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఛిట్రగుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఖాళీగా ఉన్న 11 సీట్ల భర్తీకి సోమవారం స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ నరసమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసిన, రాయని వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

విజయమూరు... అక్రమ లేఅవుట్ల జోరు !

విజయమూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విజయమూరు పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. అదేస్థాయిలో స్థలాలకు డిమాండ్ పెరగడంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకూ నీళ్లొదిలిన రియల్టర్లు ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేస్తున్నారు. పట్టణ పరిసరాల్లో సుమారు 25 చోట్ల 250 ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారు. ఇప్పటికే విజయమూరులోని నందిగుంట, లెక్కలవారిపాలెం, బొమ్మరాజుచెరువు, ఎమ్మెస్సార్ డిగ్రీ కాలేజీ తదితర ప్రాంతాల్లో లేఅవుట్లు వేశారు. వీటికి అనుమతులు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆపివేశారు. కాగా, లేఅవుట్లు వేసే ముందు ప్రజా అవసరాల కోసం పది శాతం స్థలం కేటాయించాలని, విద్యుత్, రహదారులు, మురుగుకాలువలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటుచేయాల్సి ఉంది. డీటీసీపీ లేదా నుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా రియల్టర్లు అవేమీ పట్టించుకోకుండా ప్లాట్లు వేసి రూ.



- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు
- ఇప్పటికే 25 చోట్ల 250 ఎకరాల్లో ప్లాట్లు
- బంపర్ ఆఫర్ల పేరుతో విక్రయాలు

కోట్లు గడిస్తున్నారు. అసైన్‌మెంట్ భూములు, పోరంబోకు, వాగులు, వంకలు, కాలువలనూ ఆక్రమించేసి వెంచర్లు వేసేస్తున్నారు. ఆ తర్వాత తక్కువ ధరకే ప్లాట్లు విక్రయిస్తున్నామంటూ ప్రజలను నమ్మిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. తీరా అవి కొనుగోలు చేసిన ప్రజలు తాము నష్టపోయామంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుని, ప్రజలు మోసపోకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఏటీఎం కార్డుల దొంగ అరెస్ట్

నిందితుడిపై పలు జిల్లాల్లో కేసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కార్డుల దొంగను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని వివరాలను ఆదివారం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. గత నెల 24వ తేదీ సాయంత్రం నెల్లూరులో నిప్పో సెంటర్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి ఓ వృద్ధుడు వచ్చాడు. ఏటీఎం నుంచి నగదు తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో పక్కనే ఉన్న ఓ వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని కార్డు తీసుకుని పిన్ నెంబరు అడిగి తెలుసుకున్నాడు. ఆ తర్వాత మిషన్ నుంచి నగదు రావడం లేదని చెప్పి కార్డు మార్చి వేరే కార్డు వృద్ధుడికి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో వృద్ధుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ జీ నవీన్ సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామానికి చెందిన ముప్పరాజు సురేంద్రగా గుర్తించారు. అతడిని నిప్పో సెంటర్ సమీపంలో పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఏడు ఏటీఎం కార్డులు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై మేదరమెట్ల, పొదిలి, గిద్దలూరు, కావలి, కందుకూరు, తెనాలి, గోదావరి జిల్లాలోని ప్రకాష్ నగర్ పోలీసు స్టేషన్‌లో కేసులు ఉన్నాయని, పలు క్రిమినల్ కేసుల్లోనూ జైలుకు వెళ్లివచ్చాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

గాదెలదిన్నెలో మోటారు వైర్ల చోరీ

విడవలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించే విద్యుత్ మోటార్ల దొంగతనాలు మండలంలో వరుసగా జరుగుతున్నాయి. ఆదివారం తెల్లవారు జామున గాదెలదిన్నె గ్రామంలో మోటారు వైర్ల చోరీ జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గాదెలదిన్నెకు చెందిన రైతులు తంగేళ్ల సుబ్రమణ్యం, కప్పిర సుబ్రమణ్యం పైడేరు కట్ట సమీపంలో 20 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సాగునీటి కోసం ఏర్పాటు చేసిన 5హెచ్‌పీ 3 మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను దొంగిలించారు. ఈ ఘటనలో రైతులు సుమారు రూ. లక్ష వరకూ నష్టపోయారు. ఈ మేరకు బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ తెలిపారు.



చోరీకి గురైన మోటార్లు

దూదేకులను చైతన్యవంతం చేద్దాం



నియామకపత్రం అందుకుంటున్న పీరయ్య

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన దూదేకుల కులస్థులను చైతన్యవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం అన్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అపోహలతో కొంతమంది కులాన్ని దాచి పెడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యవంతం చేసేందుకు దూదేకుల చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి ప్రభుత్వం చేపట్టబోయే కులగణన సర్వేలో బీసీ-బీ కింద కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు. కమిటీ అధ్యక్షుడిగా పీరయ్య, మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా షేక్ పీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా, మండల కమిటీ బాధ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి సిద్దయ్య, యూత్ నాయకులు షేక్ మస్తాన్, షరీఫ్, మహమ్మద్, ఉదయగిరి మండల అధ్యక్షులు షేక్ అల్లాబాషా, నాగూల్‌మీరా, షేక్ అమీన్, ఖాసింబీ, సైదాబాను తదితరులు పాల్గొన్నారు.

పట్టుకోండి చూద్దాం!

- బుచ్చి పోలీసులకు బైకు దొంగల సవాల్
- సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినా స్పందించని వైనం
- బాధితుల గోడు వినేదెవరు?

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలో గత కొంతకాలంగా మోటారు బైకుల దొంగలు హల్ చల్ చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల బైకులు చోరీ అయ్యాయి. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు దొంగలేమో.. వరుసగా బైక్‌లు చోరీ చేస్తూ 'పట్టుకోండి చూద్దాం' అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా జూలై 27న బుచ్చి బస్టాండ్ సెంటర్ సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో సంక్రాంతి లాడ్జ్ మేనేజరు వెంకటేశ్వర్లు తన హీరో గ్లామర్ (ఏపీ 26 టీకే 2462) బైకును లాడ్జ్ కింద వున్న రాయల్ వైన్స్ ముందు పార్కు చేశాడు. 28వ తేదీ వేకువజామున వచ్చి చూసేసరికి బైకు మాయమైంది. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తరువాత ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలలో పరిశీలించి 27న అర్ధరాత్రి 12.48 గంటలకు బైక్ చోరీ చేస్తుండగా రికార్డు అయి ఉన్న సీసీ ఫుటేజీలను కూడా పోలీసులకు ఇచ్చాడు. ఈ తరహాలో గత కొన్నిరోజులుగా బుచ్చిలో ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఒకటి, కామాక్షి కాలనీ పరిసరాలలోని జాతీయ రహదారి సమీపంలో ఒక బైకు చోరీకి గురయ్యాయి. అంతేకాకుండా పలు గ్రామాలలో దొంగలు బైకులను చోరీ చేస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నారని బుచ్చిలో పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా చోరీ చేసిన దొంగలు మాత్రం దొరల్లా తిరుగుతుంటే.. బైకులు పోగొట్టుకుని తాము పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నామంటూ బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు బైకు దొంగలను పట్టుకుని వారి ఆట కట్టించాలని బాధితులు, ప్రజలు కోరుతున్నారు.



బుచ్చిలోని రాయల్ బార్ వద్ద పార్కు చేసిన బైకును దొంగ చోరీ చేస్తుండగా రికార్డయిన సీసీ ఫుటేజీ

మోసం చేశాడని దళారిపై కేసు

నెల్లూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తనతో నమ్మకంగా ఉంటూ బియ్యాన్ని అక్రమంగా విక్రయించాడన్న ఫిర్యాదు మేరకు ఓ దళారిపై నెల్లూరు రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.... నెల్లూరులోని బంగ్లాతోటకు చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లుకు నరుకూరు మార్గంలో పరాశక్తి రైసు మిల్లు ఉంది. అందులోని బియ్యాన్ని హైదరాబాద్‌లో అమ్ముతానని చెప్పి తీసుకెళ్లిన విజయవాడకు చెందిన దళారి కోట సత్య నారాయణ, అక్కడ కాకుండా మరో ప్రాంతంలో తక్కువ ధరలకు అమ్ముతూ తనను మోసం చేశాడని వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి రైల్వే గేటు వద్ద కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని గాంధీనగర్‌కు చెందిన కుమార్, శ్రీను మోటారు బైకుపై పోర్టు నుంచి నెల్లూరుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. పోర్టు రోడ్డుపై ఉన్న వంతెన వద్ద మలుపు తిరుగుతుండగా సర్వేపల్లి నుంచి ఇడిమేపల్లి వైపు వెళ్తున్న ఓ ఆటో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకులో వెళుతున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ.117.20

వరకట్న నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

అల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరకట్న నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి సమాజంలో వరకట్నాన్ని తీసుకోవడం ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ఈ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం అలసత్వం వహించడం సరికాదని పేర్కొన్నారు. వివాహాన్ని వివాహ బంధాన్ని గౌరవించే తెలుగు రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్‌కు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగూరు సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే గనికుంట ఫీడర్ 11 కేవీ విద్యుత్ లైన్‌కు ఇబ్బంది కలిగించే చెట్లు కొమ్మలు సోమవారం తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గనికుంట ఫీడర్ పరిధిలోని కల్వకూరివారిపాలెం, దివివారిపాలెం, గనికుంట వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహరించాలని కోరారు. మధ్యాహ్నం 1 గంట నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

బిట్రగుంట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బోగోలులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కోశాధికారి సీవీసీ సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 11 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలన అభివృద్ధి, సంక్షేమం పెద్దఎత్తున జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్‌యాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బాలసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కరపత్రాల పంపిణీ

లింగసముద్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరెడ్డి అధ్యక్షతన ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షఫీ, నాయకులు రసూల్, షరీఫ్, రసూల్ హమీద్, ఫయాజ్, కమలాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి జాఫర్ పాల్గొన్నారు.

కోన నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు వితరణ

రాపూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పెంచలకోన శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రాపూరు పట్టణానికి చెందిన సిద్ధలయ్య సెంటర్‌లోని ప్రొవిజన్ షాపు యజమాని విచ్చన్నగిరి గురవయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతులు ఆదివారం రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ నగదును కోనలో ఆలయ సిబ్బందికి అందజేశారు. దేవస్థానం అధికారులు వారికి స్వామి, అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లో దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిర్లక్ష్యానికి కేరాఫ్ 'టిడ్కో'!

- సమస్యలు పట్టించుకునే వారేరీ? ● అవస్థలు పడుతున్న ప్రజలు



టిడ్కో గృహాలకు పైకి అల్లుకుంటున్న చెట్ల తీగలు

కావలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహ సముదాయం పిచ్చి మొక్కలు, మురుగు నీటి నిల్వలతో అపరిశుభ్రతకు, నిర్లక్ష్యానికి కేరాఫ్‌గా మారింది. భయాందోళనల మధ్య నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అసలే చెరువు అంచున నిర్మించి ఉన్న ఆ గృహ సముదాయాలకు చుట్టూ ప్రహరీ లేక పాములు, తదితర విష పురుగులు బెడదతో భయపడుతున్నారు. దీనికి తోడు గృహాల సముదాయాలు చుట్టూ పిచ్చిమొక్కలు అడవిని తలపించేలా పెరుగుతున్నాయి. ఈ పిచ్చి మొక్కల తీగలు భవనం పై అంతస్థులకు పైకల్లా పాకుతూ పోతుండటంతోపై ఆ అంతస్థులలో నివాసాలు ఉండే వారికి కూడా పాములు, తదితర విష పురుగుల బెడద తప్పేట్లు లేదని ఆందోళన చెందుతున్నారు. అసలే అక్కడ సమస్యలతో సతమత మవుతుండగా ఇప్పుడు అదనంగా గృహాలు చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతూ అడవిలా తయారవుతుండటంతో ఇళ్లలో నుంచి బయటకు వస్తే ఎక్కడ విష పురుగుల కాటుకు గురవుతామని ప్రజలు భయపడుతున్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటూ స్వచ్ఛ సర్వేక్షణ బహుమతులు కూడా తీసుకుంటున్న మున్సిపల్ అధికారులకు టిడ్కో గృహ సముదాయంలో



గృహ సముదాల మధ్య అడవిలాపెరిగిన పిచ్చి మొక్కలు



టిడ్కో ఇళ్ల వద్ద నిల్వ చేరిన మురుగు

ఉన్న పారిశుధ్య సమస్య వారి కంట పడకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు అక్కడ గ్యాంగ్ వర్క్ పెట్టి అక్కడ ఉన్న పిచ్చి చెట్లను తొలగించాల్సి ఉంది. ఆ తర్వాత అక్కడ నివాసం ఉంటున్న వారితో సమావేశాలు నిర్వహించి ఎవరి ఇళ్ల ముందు వారు ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు మొలవకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వారిలో చైతన్యం తీసుకు రావాల్సి ఉంది.

పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ విభాగంలో ఆదివారం డిప్లొమా ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు స్నేహ పూర్వక స్వాగతం పలికేందుకు సీనియర్లు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయశ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే అనేది విద్యార్థి జీవితంలో మర్చిపోలేని ఘట్టమని, ఇది కొత్త పరిచయాలకు వేదికగా నిలుస్తుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులు చదువులో మెరుగుపడడమే కాకుండా తమ ప్రతిభను గుర్తించుకుని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునే అవకాశం రోజుగా ఉపయోగించుకోవాలన్నారు. చదువుతోపాటు ఆనందిస్తూ విజయం వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ వేడుకల్లో పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ హరిబాబు, అన్ని విభాగా హెచ్‌వోడీలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పతనంలో ఉపాధ్యాయుల పోరాట పాత్ర కీలకం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి(టౌన్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పతనంలో ఉపాధ్యాయుల పోరాట పాత్ర కీలకమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు అధ్యక్షతన జరిగిన బహుజన టీచర్స్ అసోసియేషన్ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టిన ఏ ప్రభుత్వం అయినా పతనం అవ్వాల్సిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తన కుమారుడు లోకేష్‌నే విద్యాశాఖ మంత్రిని చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యను, విద్యావిధానాలను నిర్వీర్యం చేశారని, హక్కుల కోసం గళమెత్తిన ఉపాధ్యాయులను అణచివెయ్యాలని నిర్బంధాలు పెట్టినా పెద్దఎత్తున ఉపాధ్యాయులు ఉద్యమించిన తీరు ఎన్నికల్లో కూటమి పార్టీ నేతలకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిట్టేడు రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మాసా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో 142వ నేత్రదానం



అంజమ్మ(ఫైల్)

కావలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సుంకర దయాకర్‌రెడ్డి తల్లి సుంకర అంజమ్మ(82) వృద్ధాప్యంతో మృతి చెందగా ఆమె చివరి కోరిక మేరకు ఆమె నేత్రాలను కావలి రెడ్‌క్రాస్ సహకారంతో దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ ఆమె కార్నియాలను ఆదివారం సేకరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరనాథ్‌లు దయాకర్‌రెడ్డికి ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 142వ నేత్రదానమని తెలిపారు.

7వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు'



సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాది అందించిన సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధిపై ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌస్‌బాషా, రూబీ, ఖాదర్‌బాషా, నాయబ్ రసూల్, జహార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి పలువురి సంతాపం



డీఏ కోటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దివి శివరాం

ఉలవపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకుడు డీఏ కోటయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఈయన ఉలవపాడు సొసైటీ అధ్యక్షుడిగా, ఒంగోలు కోఆపరేటీవ్ బ్యాంక్ డైరెక్టర్‌గా, ఒంగోలు సూపర్ బజార్ డైరెక్టర్‌గా, మండల పరిషత్ వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా వివిధ పదవుల్లో కొనసాగారు. విషయం తెలుసుకున్న కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం మృతదేహాన్ని సందర్శించారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా పోడపాటి సుధాకర్, మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు కోటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం



కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతను వివరిస్తున్న సభ్యులు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి రోజున శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని మానవ రూపంలో అవతరించిన భగవంతుడు అయనను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు కందుకూరు పట్టణం సాయినగర్‌లో ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. పూర్వం శ్రీకృష్ణాష్టమి 11 రోజులపాటు చేసేవారని, చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారని తెలిపారు. ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగాల బాధలు ప్రజలకు ఉండేవి కావ ని ఒక నమ్మకం ఉండేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర్లు, నరసింహులు, కృష్ణారెడ్డి, ఎస్ లక్ష్మి, రమ్యశ్రీ, కొండలరావు పాల్గొన్నారు.

మండల సమావేశానికి గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా!



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరైన మండలస్థాయి అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు హాజరయ్యే సమావేశనికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు హాజరై సమస్యలపై సమాధానాలు చెప్పాలన్నారు. కానీ ఈ సమావేశానికి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, విద్యుత్, అటవీ, ఇరిగేషన్ అధికారులు గైర్హాజరవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై గైర్హాజరయ్యే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ మండలానికి మరో 50 గోకుల షెడ్లు మంజూరయ్యాయని చెప్పడంతో గతంలో నిర్మించిన గోకుల షెడ్లకు బిల్లులు ఇవ్వలేదని సభ్యులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పోలేరమ్మ విగ్రహం పునఃప్రతిష్ఠ



పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ఏఎస్ పేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చిరమన గ్రామంలోని శివాలయం విధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా ప్రత్యేక హోమాలు నిర్వహిస్తూ వేద మంత్రాలతో ప్రత్యేక హోమాలు, పూజలు జరిపించారు. కంకణధారణ చేసుకున్న వారు అమ్మవారి పూజలు చేశారు. కార్యనిర్వాహకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, నరసింహారెడ్డి, కర్నాటి మధుసూదనరెడ్డి, రామిరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మన ఆలోచనలే మన భవిష్యత్



మాట్లాడుతున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ ప్రకృతి ఉమామహేష్

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆలోచనలు విత్తనం అయితే, జీవితం ఆ విత్తనం నుంచి వచ్చిన ఒక మహావృక్షమని, మన ఆలోచనలతోనే మన భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్, పీఎఫ్ డబ్ల్యూ గ్లోబల్ వ్యవపస్థాకుడు ప్రకృతి ఉమామహేష్ తెలిపారు. పట్టణ సమీపంలోని తిరునాళ్లతిప్పలో వెలసి ఉన్న కాశీనాయన ఆశ్రంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరంలో 'భిన్నంగా ఆలోచించు, ఎక్కడైనా ఎప్పుడైనా ఆనందంగా ఉండడం'పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మనిషిలో ఆనందం, ప్రశాంతత పెరిగేకొద్ది అతని విజయాలు, శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని తెలిపారు. మనశ్శాంతి పొందాలంటే మనస్సును సాత్వికగుణంలో ఉంచుకోవడానికి ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధి బలం పెరగడంతో పాటు శరీరంలో రోగాలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు చంద్రా విజయలక్ష్మి, రమణయ్య, మూరంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచిస్తున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎన్.వెంకటరావు అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఆటోడ్రైవర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ఆటోలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలకు గురికావద్దన్నారు. ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే పంచాయతీ బస్టాండ్ వ్యాపా రస్తులతో మాట్లాడారు. మార్జిన్‌లను ఆక్రమించి వాహన రాకపోకలకు ఇబ్బం ది కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండ్ వైశాల్యం తక్కువగా ఉన్నందున అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఘనంగా పొంగళ్లు

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో వెలిసి ఉన్న శ్రీపోలేరమ్మ తల్లి అమ్మవారికి ఘనం గా పొంగళ్లు నిర్వహించారు. శుక్రవారం నిలుపుతో మొదలు పెట్టిన ఉత్సవాలు శనివారం అమ్మవారి బ్రహ్మోత్సవం, ఆదివారం అమ్మవారికి పొంగళ్లు, అన్నదానంతో ఉత్సవాలను ముగించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

ఉదయగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో 'అన్నదాత సుఖీభవ' పథకం అన్నదాతలకు అండగా ఆదుకుంటుందని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పథకం సొమ్మును ప్రభుత్వం రైతు ఖాతాలకు జమ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ తన ఐదేళ్ల పాలనలో రైతులను నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికి ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ తీసుకొచ్చి రైతులను అన్నివిధాల ఆదుకుంటూ లాభసాటిగా మారుస్తుందన్నారు.

కాశీరావు పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జనసేన మండల నాయకులు

సీతారామపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం భోగినేని కాశీరత్తయ్య (గాంధీ) ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జాషువా, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, తోట మనోజ్, రాజశేఖర్, తోట మాల్యాద్రి, తోట ఏడుకొండలు, వీకాష్‌బాబు, కొత్త జగదీష్, తోట నవీన్, గౌస్, రాజేష్, కిరణ్, జనసేన మండల, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతి చెందిన నాలుగు కుటుంబాల సభ్యులకు ఒక్కొరికి రూ.10,000 వంతున రూ.40,000 సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. 2వ వార్డు పరిధిలోని షేక్ షరిఫున్నీసా, 4వ వార్డు పరిధిలో చల్లా సునీత, 13వ వార్డులో ఆత్మకూరు పెంచలయ్య, 23వ వార్డులో డీ.సుధాకరాచారి కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు చెరుకూరు తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నాగార్పమ్మదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మదేవికి పూజలు

సంగం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగార్పమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు



నిధుల మంజూరు పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని 10 ఆలయాలకు, మండలంలోని 20 ఆలయాలకు దూపదీప నైవేద్యాలకు, అర్చకులకు, ఆలయాల అభివృద్ధికి సీజీఎఫ్ గ్రాంటు కింద నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ నేతలు సంబంధిత ఆలయాల అర్చకులకు, నిర్వాహకులకు నిధులు మంజూరు పత్రాలను అందజేశారు. ఆత్మకూరు పట్టణంలోని కృష్ణ మందిరం ఆలయానికి రూ.5 లక్షలు, మురగళ్లలోని ఆలయానికి రూ.5 లక్షలు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, రూరల్ అధ్యక్షులు సుంకర పెంచలచౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మద్దినేని నారాయణ, పచ్చా పిచ్చయ్యచౌదరి పాల్గొన్నారు.

దొంగలు దొరకలేదని కేసులు క్లోజ్..!



- వైసీపీ హయాంలో 50కిపైగా మూసేసిన వైనం
- స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- ఇప్పుడు మేమేం చేసేదంటున్న పోలీసులు

ఎంతో కష్టపడి.. పైసా పైసా కూడబెట్టుకున్న సొత్తు దొంగల పరమైతే ఆ బాధితుల వేదన ఎంతో? ఎప్పటికైనా పోలీసులు రికవరీ చేసిస్తారన్న ఆశతో ఏళ్ల తరబడి చూసిన వారికి.. తమ కేసులు మూసేశారని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో దొంగతనం, దోపిడీ, బ్యాగులు ఎత్తుకెళ్లడం వంటి కేసుల్లో రికవరీపై పోలీసులు పెద్దగా దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి. దొంగలు దొరికినప్పుడు చూద్దాం.. అనుకుంటూ ఉదాసీనంగా ఉండిపోయారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరకు.. ప్రతి నెలా జరిగే ఎస్పీ నేర సమీక్షా సమావేశంలో సమాధానం ఎందుకు చెప్పుకోవాలని భావించారు. చివరకు దొంగలు దొరకలేదంటూ కేసులు మూసేశారు. ఇలా 2019 నుంచి 2024 వరకు.. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మూసేసిన కేసులు ఉండటం గమనార్హం. అప్పట్లో పోలీసు బాస్‌లు కేసులు కూడా రికవరీపై దృష్టి సారించకపోవడంతో కిందస్థాయిలోనూ అదే నిర్లక్ష్యంతో ఉన్నారన్న ఆరోపణలున్నాయి. తమ కేసులు మూసేసినా.. పలువురు బాధితులు ఇప్పటికీ పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. అప్పట్లో దొంగతనం జరిగి.. కేసులూ మూసేస్తే ఇప్పుడు మేము ఏం చేయాలంటూ కొందరు పోలీసులు బాధితులను ప్రశ్నిస్తున్నారు. ఇంతకాలం మీరేం చేస్తున్నారు. ఇప్పుడు మా వద్దకొచ్చి మొత్తుకుంటే ఎలాగంటున్నారు. దీనిపై గత సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఓ బాధితురాలు ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

● తిరుపతి నగరం లక్ష్మీపురానికి చెందిన జి.శశివదన కుటుంబంతో కలసి 2022 సెప్టెంబరు 22న స్వగ్రామంలో శుభ కార్యానికి బయలుదేరారు. ఇంట్లోని దాదాపు 500 గ్రాముల బంగారు నగలు, మరో 120 గ్రాముల వెండి వస్తువులు, దాదాపు రూ.2.40 లక్షల నగదు సూట్‌కేసులో ఉంచుకుని తిరుపతి ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేస్తున్న సమయంలో దొంగ ఏమార్చి.. సూట్‌కేసును అపహరించుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో (421-2022) కేసు నమోదైంది.

● తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్వీపీ కాలనీలో కాపురమున్న ఎస్వీబీసీలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.విమల 2019 ఫిబ్రవరి 26న ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. అక్కడ్నుంచి తన కుమారుడు చదువుతున్న విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లారు. ఇంటికి వేసిన తాళాన్ని దుండగులు పగులగొట్టి దాదాపు రూ.2.80 లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ (89-2019) కేసు నమోదు చేశారు.

- ఈ రెండు దొంగతనాల కేసుల్లో దొంగలు దొరకలేదంటూ గతేడాది ఎన్నికల ముందే కేసు మూసేశారు. ఇలా జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసేసిన కేసులు (అన్ డిటెక్టివ్) 50కి పైగా ఉన్నట్లు సమాచారం. తమకు న్యాయం జరగక బాధితులు లబోదిబోమంటున్నారు.

ప్రాణం తీసిన విహార యాత్ర

- ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్న బైకు
- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు


భవానిప్రసాద్ (ఫైల్ ఫొటో)


ముడూరు గణేష్ (ఫైల్ ఫొటో)

దొరవారసత్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు. సరదాగా గడుపుదామని ఆ ముగ్గురు మిత్రులు బైకుపై విహార యాత్రకు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో యల్లంపాటి భవానిప్రసాద్(22), ముడూరు గణేష్(17) మృతి చెందగా, బట్టా అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాద ఘటన దొరవారిసత్రం మండలం అక్కరపాక పెట్రోల్ బంకు ఎదురుగా జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ముగ్గురిది నాయుడుపేట మండలం పుదూరు గ్రామం. భవానిప్రసాద్ చెన్నైలోని దానిష్ అహ్మద్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఈసీ ఫైనలియర్ చదువుతున్నాడు. అదే కాలేజీలో గణేష్ బీటెక్ ఫస్టియర్‌లో చేరాడు. సెలవు కావడంతో సరదాగా వరదయ్యపాళెం మండలం ఉబ్బలమడుగు వెళదామనుకున్నారు. మరో స్నేహితుడు అనిల్‌తో కలిసి స్పోర్ట్స్ బైక్‌లో బయలుదేరారు. అతి వేగంగా వెళుతున్న వీరు అక్కరపాక పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ముందు వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొన్నారు. రోడ్డుపై పడిపోవడంతో తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే హైవే పోలీసుల సాయంతో 108 ద్వారా ముగ్గురినీ సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భవానిప్రసాద్, గణేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు విరిగి తీవ్రంగా గాయపడిన అనిల్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలం పరిశీలించారు. ఇద్దరు యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులది ఒకే గ్రామం కావడంతో.. వారంతా సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి చేరుకొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనతో ఆస్పత్రి ప్రాంగణం విషాదంగా మారింది. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు.


గణేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

అండగా నిలుస్తారనుకుంటే..!

వాళ్లది నిరుపేద కుటుంబం. కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. ఉద్యోగులై కుటుంబానికి అండగా నిలుస్తారనుకున్న ఇద్దరు యువకులు.. విగతజీవులుగా మారడంతో రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది. అక్కరపాక వద్ద ప్రమాద మృతులు.. గాయపడిన యువకుడిది నాయుడుపేట మండలం పుదూరు. ఆదివారం సాయంత్రం రెండు మృతదేహాలు గ్రామానికి రావడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

● బాలకృష్ణ, విజయమ్మ దంపతుల కుమారుడు భవానీప్రసాద్. ఇతడి సోదరి జ్వాలా. బాలకృష్ణ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించడంతో పాటు ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. ఈ సంవత్సరంతో కుమారుడి బీటెక్ పూర్తయితే.. ఉద్యోగంలో చేరి అండగా నిలుస్తాడని ఆ కుటుంబం భావించింది. ఇంతలో ఈ ప్రమాదం వారి కలలను ఛిద్రం చేసింది.

● ఇక, కుమారుడు గణేస్‌తో కలిసి సుబ్బమ్మ నాలుగేళ్ల కిందట శ్రీకాళహస్తి అగ్రహారం నుంచి పుదూరుకు వచ్చారు. కూలి పనులు చేసుకొంటూ కొడుకుని చదివిస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడి మరణం ఆమెను కుంగదీసింది.

● గాయపడిన అనిల్‌దీ పేద కుటుంబమే. ఇతడి తండ్రి హోటల్‌లో పనిచేస్తున్నారు. అదే హోటల్‌లో తనూ పనికి చేరాడు అనిల్. ఇంతలో తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరారు. ఆస్పత్రి ఖర్చులు భరించడం ఆ కుటుంబానికి తలకుమించిన భారమవుతోంది.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి


సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

రప్పా రప్పా అంటూ బెదిరించలేరు

- జగన్‌పై మంత్రి సత్యకుమార్ విమర్శ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో దోచుకున్న వారిని అరెస్టు చేస్తే.. పరామర్శల పేరుతో జగన్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. ఆయన పర్యటనల్లో తలకాయలను తొక్కించడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వీటిని ప్రశ్నిస్తే రప్పా రప్పా అంటూ బెదిరించడం ఏంటి? ఒక సిద్ధాంతం, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్యానికి మారుపేరైన బీజేపీ కార్యకర్తలను ఇలా బెదిరించలేరు' అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతిలోని జిల్లా బీజేపీ కార్యాలయానికి ఆదివారం వచ్చిన ఆయన నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. గత ఐదేళ్లు ఒక అవినీతికోరు ఈ రాష్ట్రాన్ని పాలించి సర్వం దోచుకున్నారని విమర్శించారు. తిరుపతిలో నకిలీ నూనె అమ్మకాలు, జీరో వ్యాపారాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ఆహార భద్రత ప్రధాన కార్యాలయంలో 270 మంది సిబ్బందికిగాను కేవలం ఆరుగురే ఉన్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ విభాగాన్ని విస్మరించి పరోక్షంగా అక్రమార్కులకు సహకారం అందించిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఆ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టిందని, ఇకపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రారెడ్డి, కంద్రిక ఉమ, ఎస్ఎస్ఆర్ నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్, జిల్లా ఇంచార్జి పార్థసారథి, చిత్తూరు జిల్లా ఇన్చార్జి విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, డాక్టర్ కదిరి నరేష్‌బాబు, డాక్టర్ మునికృష్ణయ్య పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ.. పట్టివేత


శ్రీనివాసన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సబ్‌జైలు నుంచి పరారైన రిమాండ్ ఖైదీని కొద్ది గంటల్లోనే పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నాగలాపురంలో గత నెల 20వ తేదీ రాత్రి ముస్తఫా టెక్స్‌టైల్స్‌లో దొంగలు చొరబడి వస్త్రాలు, నగదు దోచుకెళ్లారు. ఈ కేసును ఎస్ఐ సునీల్ దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలోని సీసీ ఫుటేజిల ఆధారంగా నిందితులు చిత్తూరు జిల్లా విజయపురం మండలం కాళీకాపురానికి చెందిన మహేష్, పిచ్చాటూరు మండలం కారూరుకు చెందిన శ్రీనివాసన్, సూర్యగా గుర్తించారు. వీరిని గతనెల 29న నారాయణరాజు కండ్రిగ సమీపాన పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం వీరిని సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం జైలులోని బ్యారక్‌లను శుభ్రం చేసేందుకు సూపరింటెండెంట్ కరీముల్లా ఖైదీలను బయటకు వదిలారు. ఇదే అదనుగా శ్రీనివాసన్ పోలీసుల కళ్లుగప్పి జైలు బాత్రూం గోడపైకి ఎక్కి.. తహసీల్దార్ కార్యాయం వెనుక వైపు దూకి పరారయ్యాడు. శ్రీనివాసన్ కనబడకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శ్రీనివాసన్ నాగలాపురంలోని తన ప్రియురాలు ఇంట్లో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. రిమాండ్‌లో ఉండి తప్పించుకున్నందున శ్రీనివాసన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ కరీంబాషా తెలిపారు. కాగా, సత్యవేడు సబ్‌జైలు నుంచి గతంలోనూ ఇద్దరు రిమాండ్ ఖైదీలు తప్పించుకోగా వారిని కూడా ఇలానే గాలించి పట్టుకున్నారు. ప్రధానంగా ఈ సబ్‌జైలు గోడలు తక్కువ ఎత్తులో ఉండడం కారణం కావచ్చని పోలీసులు భావిస్తున్నారు.



మహాసభల సందర్భంగా ర్యాలీలో నారాయణ, నాయకులు

అట్టహాసంగా సీపీఐ జిల్లా మహాసభలు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో రెండు రోజుల పాటు జరిగే సీపీఐ రెండో జిల్లా మహా సభలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు కళాకారుల డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ, సెప్టెంబరు 17న జరిగే జాతీయ మహాసభలను పురస్కరించుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో మహా సభలు నిర్వహించి ప్రజల పక్షాల పోరాడేందుకు ముందుంటామన్నారు. సోంపేట భూములను రాష్ట్ర ప్రభుత్వం బడాబాబులకు అప్పగించే పద్ధతి మానుకోవాలన్నారు. ఈ నెల 11న ఆ భూములను సందర్శించనున్నట్లు తెలిపారు. కరేడు భూములను ప్రైవేట్ వారికి అప్పగిస్తే రైతుల పక్షాలన పోరాడతామన్నారు. వర్షం రావడంతో బహిరంగ సభ కేవలం 10 నిమిషాలు మాత్రమే జరిగింది. ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ రెడ్డి, రామానాయుడు, జయలక్ష్మి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ప్రభాకర్, మురళి, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, ఆనంద్, చెంచమ్మ తదితరులు ఉన్నారు.

తుంబుర తీర్థానికి కలెక్టర్

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తుంబర తీర్థాన్ని ఆదివారం కలెక్టర్ వేంకటేశ్వర్ సందర్శించారు. పాపవినాశనం నుంచి ఉదయం 9 గంటలకు కాలినడకను తీర్థానికి చేరుకున్నారు. తుంబుర నాథుడిని దర్శించుకున్నారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు పాపవినాశనంకు చేరుకున్నారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా సందర్శించాల్సిన ప్రాంతం తుంబుర తీర్థమన్నారు. భవిష్యత్తులో నిరంతరాయంగా ఈ తీర్థానికి భక్తులను అనుమతించేలా అటవీ శాఖ, టీటీడీతో సమన్వయం చేసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ఫారెస్ట్ అధికారి సెల్వం, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఉన్నారు.

తీర్థంలో కలెక్టర్ వెంకటేశ్వర్



రేపు ఐసర్ 6వ స్నాతకోత్సవం


మాట్లాడుతున్న ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య

ఏర్పేడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐసర్ (భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ) 6వ స్నాతకోత్సవం మంగళవారం ఐసర్‌లో జరగనుందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్దనున్న ఐసర్ ప్రాంగణంలో ఆదివారం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇంద్రపీత్‌సింగ్ కోహ్లీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఐసర్ ఏర్పడి పదేళ్లయిందన్నారు. ఈసారి స్నాతకోత్సవంలో ఐసర్‌లో కోర్సులు పూర్తి చేసిన 255 మంది విద్యార్థులకు పట్టాలను అందజేస్తామన్నారు. ముఖ్యఅతిథిగా గోదావరి బయో రిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమైయా, ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నస్ చైర్‌పర్సన్ ఝిల్లుసింగ్‌యాదవ్ హాజరవుతారన్నారు. 2015లో ఐసర్ ప్రారంభించినపుడు బీఎస్-ఎంఎస్ కోర్సును మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం ఎన్నో పీహెచ్‌డీ స్థాయి ప్రోగ్రామ్‌లు ప్రారంభించామన్నారు. మెల్‌బోర్న్‌యూనివర్సిటీతో ఇంటర్నేషనల్ అకాడమిక్ ప్రోగ్రాం, ఆస్ట్రేలియా, మెల్‌బోర్న్ వర్సిటీలో సంయుక్తంగా అంతర్జాతీయ రీసెర్చ్ కోర్సును త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నాలుగేళ్ల ఈ కోర్సులో చేరే విద్యార్థులు రెండేళ్ల పాటు ఐసర్‌లో మరో రెండేళ్లు మెల్‌బోర్న్‌లో అభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది నాలుగేళ్ల బ్యాచురల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సైన్సెస్ (బీఎస్-ఈఎస్ఎస్), రెండేళ్ల ఎంఎస్(మాస్టర్స్ బైరీసెర్చ్) కోర్సులను ప్రారంభించనున్నామన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ర్యాంకింగ్‌లో తిరుపతి ఐసర్ దేశంలోనే 33వ స్థానంలో నిలిచిందన్నారు.

వాకాడులో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఎస్ఐలు నాగబాబు, బలరామయ్య, పోలీసు సిబ్బంది

వాకాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాకాడు బీసీ కాలనీలో ఆదివారం ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. వేకువజాము నుంచి కాలనీవాసులను బయటకు వెళ్లనివ్వకుండా పోలీసులు నిఘా పెట్టారు. సుమారు 400 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినా, మత్తు పదార్థాలు విక్రయించినా, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్టమూరు ఎస్ఐ బలరామయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కటాలమ్మకు పూజలు



కటాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాశం, తానంకి నానాజీ

గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల కటాలమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతైన కటాలమ్మను ప్రతి ఆదివారం సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకుని ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకుంటుటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో వసతులు మెరుగుకు చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకరరెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, మట్టం మురళి, పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎంఆర్‌సీ క్లబ్ స్వర్ణోత్సవాలు



క్లబ్ వ్యవస్థాపక చైర్మన్ బద్దెపూడికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నెలవల, మాజీ ఎమ్మెల్సీ వాకాటి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వైఎంఆర్‌సీ క్లబ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి కేక్‌కట్ చేశారు. వైఎంఆర్‌సీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా వ్యవస్థాపకులు బద్దెపూడి వేణుగోపాలరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాళంగి ప్రభాకర్, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఏజీ కిషోర్, మాదరపాక బాలసుబ్రహ్మణ్యం, నూతలపాటి శ్రీనివాసులు, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో వర్షం



పోలీసుస్టేషన్ పక్కన ఇళ్ల మధ్య పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచే కారుమబ్బులు కమ్ముకుని చల్లటి వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోత ఎక్కువైంది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై దాదాపు గంటకుపైగా గాలులతో కూడిన జల్లులు పడ్డాయి. పట్టణంలో గణపతి నగర్, జీఎన్‌టీ రోడ్డులో వర్షపునీటికి మురుగు తోడై రోడ్లపైకి పొంగింది. పిండిపాలెం మలుపు వద్ద జాతీయ రహదారి పక్కన తవ్వేసిన గుంతలో భారీగా వర్షపునీరు నిలిచింది.

తడలో మోస్తరు వర్షం

తడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తడలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. సాయంత్రానికి నల్లటి మేఘాలు కమ్ముకుని మోస్తరుగా వర్షం కురిసింది.

తైక్వాండో పోటీలపై కార్యాచరణ



సమావేశంలో తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కాలంలో నిర్వహించతలపెట్టిన తైక్వాండో పోటీలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తైక్వాండో క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు శిక్షణ, సెమినార్స్ నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ధనంజయులు, ట్రెజరర్ శ్రీనివాసులు, శంకర్, వాసుదేవాచారి, రవి, వెంకటరమణ, సురేష్, సంతోష్, లోకేశ్, గౌతమ్, పృథ్వి, విజయ్, అనిల్ పాల్గొన్నారు.

బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌కుమార్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్‌సంఘ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఆకుల సతీష్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో సంఘ్ 70వ వార్షికోత్సవం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ్ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. ఆకుల సతీష్‌కుమార్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రాజ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఓ యవకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే జీఆర్ పోలీసుల వివరాల మేరకు... సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(26) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం గూడూరు రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై అస్సాం నుంచి చెన్నై వెళుతున్న ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సుబ్బయ్య(70) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని అగ్రహారపేటలో నివాసం ఉంటున్న సుబ్బయ్య శనివారం రాత్రి పాత వెంకటగిరి రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సుబ్బయ్య మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





రైల్వేస్టేషన్‌లో పడమర వైపు నిర్మించిన భవనం ● ప్రారంభించ నిరుపయోగంగా ఉన్న టిక్కెట్ బుకింగ్ కౌంటర్

నిరుపయోగంగా రైల్వే టిక్కెట్ కౌంటర్

నిర్మాణం పూర్తయి నాలుగేళ్లయినా ప్రారంభానికి నోచుకోని భవనం ● అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

గూడూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గూడూరు రైల్వేస్టేషన్ ఆవరణలో పడమర వైపు ఉన్న టిక్కెట్ బుకింగ్ కౌంటర్ నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గూడూరు రైల్వేస్టేషన్ జంక్షన్ కావడంతో విజయవాడ, చెన్నై, తిరుపతి మార్గాల్లో సుమారు 65కు పైగా ప్యాసింజర్, మెమూ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు గూడూరు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. కాలక్రమేణా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో స్టేషన్‌కు తూర్పు వైపున ఉన్న టిక్కెట్ కౌంటర్ వద్ద రద్దీ నెలకొనేది. పట్టణంలో పడమర వైపు నుంచి వచ్చే ప్రయాణికులు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలను దాటుకుని తూర్పు వైపు ఉన్న కౌంటర్ వద్దకు వచ్చి టిక్కెట్‌లు తీసుకోవాల్సి ఉండేది. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన రైల్వేశాఖ నాలుగేళ్ల క్రితం స్టేషన్ పడమర వైపు నూతనంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాన్ని నిర్మించింది. అయితే ఇప్పటి వరకు ఆ భవనం వినియోగంలోకి రాలేదు. ప్రారంభానికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకాలపాలకు నెలవుగా మారుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతనంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న బుకింగ్ కౌంటర్ ఆవరణ

వెంకటరెడ్డి లేనిలోటు టీడీపీకి తీర్చలేనిది: సోమిరెడ్డి



వెంకటరెడ్డికి నివాళలర్పిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

డక్కిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి లేని లోటు టీడీపీకి తీర్చలేనిదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డక్కిలి మండలంలోని మాటుమడుగు గ్రామంలో పోలంరెడ్డి వెంకటరెడ్డి వర్ధంతి జరిగింది. ఆయనకు నివాళులర్పించిన అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ వెంకటరెడ్డి లాంటి నాయకులు ఉండబట్టే వెంకటగిరి టీడీపీకి కంచుకోటగా నిలుస్తోందన్నారు. తాను 1987లో కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ఉన్నప్పుడు, వెంకటరెడ్డి సొసైటీ అధ్యక్షుడుగా తనతో కలిసి పనిచేశామని, అప్పటి నుంచి ఆయన తుదిశ్వాస వదిలేవరకు తమ అనుబంధం కొనసాగిందని గుర్తుచేసుకున్నారు. వెంకటరెడ్డికి నివాళలర్పించిన వారిలో నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు దనుంజయరెడ్డి, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, వెంకటగిరి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, వెంకటగిరి ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, డక్కిలి మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య, నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, మస్తాన్ నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, దిలీప్, దందవోలు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న పగడాల శివ, హంసా పృధ్వి

నాయుడుపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు వారి విద్యాభ్యాసం కోసం బలిజ సంఘ ఆర్థిక సాయం అందిస్తుందని ఆ సంఘ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసా పృధ్వీ తెలిపారు. నాయుడుపేటలో పగడాల ప్రదీప్ కార్యాలయం వద్ద ఆదివారం ఓజిలి మండలానికి చెందిన పుల్లా హాసినీ విద్యాభ్యాసం కోసం రూ.9వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు హంసా రామారావు, నీలం హరికృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.4.28 కోట్లు లభించింది. శనివారం 82,367 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు

చిల్లకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యానగర్‌లో ఎన్‌బీకేఆర్ వర్ధంతి



బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వర్ధంతి ఆదివారం జరిగింది. విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న బాలకృష్ణారెడ్డి కాంస్య విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

15న సామూహిక వరలక్ష్మీవ్రతం

తిరుపతి(జీవకోన), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరసింహాచార్య, బాబుస్వామి, తులసీ రామశర్మ తెలిపారు. కరకంబాడీ రోడ్డులోని అట్లాంటిస్ స్కూల్ పక్కన ఉన్న పుష్పగిరి మఠంలో సాయంత్రం 4గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతం ఎంతో ప్రాశస్త్యమైందని, అందరికీ లక్ష్మీ కటాక్షం కలగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9441661212, 7659927777, 9949339851, 9550595916, 9701553046, 9849120030లను సంప్రదించాలన్నారు.

రోడ్లపై పారుతున్న మురుగునీరు

వాహనచోదకులు, పాదచారుల అవస్థలు



పాత వెంకటగిరి రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల మురుగునీరు రోడ్లపై పారుతోంది. ప్రధానంగా పాత వెంకటగిరి రోడ్డు వద్ద డ్రైనేజీ కాలువ పొంగి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలో పూడిక సరిగా తీయడంతో మురుగునీరు పొర్లి రోడ్లపైన ప్రవహిస్తోంది. మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టి మురుగునీరు రోడ్లపై పారకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సిరామిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మిగిలిన 12 సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9912342070, 8985348925 నెంబర్లను సంప్రదించాలన్నారు.

శివకుమార్‌కు సన్మానం



శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో ఓఆర్ఐ - శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్తంగా శివకుమార్ దంపతులను ఆదివారం సన్మానించాయి. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అవధాని మేడసాని మోహన్ తదితరులు పాల్గొని బాల సాహిత్యానికి గంగిశెట్టి చేసిన కృషిని కొనియాడారు. ఆయన యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. డాక్టర్ తొండాటి రాజశేఖర్ వందన సమర్పణ చేశారు. రిటైర్డు ప్రొఫెసర్లు చిత్రాజు గోవిందరాజు, జక్కంపూడి మునిరత్నం, కోసూరి దామోదర నాయుడు, ఆనంద నాయుడు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, రిటైర్డు లైబ్రేరియన్ వల్లువార్ షణ్ముగం, ఏనుగు అంకమ నాయుడు, గంగిశెట్టి శివకుమార్ సాహిత్యంపై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ రామలింగయ్య, రచయితలు రాసాని, జిల్లేళ్ల బాలాజీ, కృష్ణస్వామిరాజు, మూరిశెట్టి గోవిందు, తోట వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, డీన్లు నరసింహ, బాలాజీ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రీడల ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి వివిధ క్రీడాంశాల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఆదివారం తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్వీయూ, శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీ ఆర్ట్స్ హాకీ, ఓల్డ్ ఏజీఎస్ కాలేజీ గ్రౌండ్‌లలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. 22 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి ఆధార్, ఏదైనా గుర్తింపు కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ హిందూజ (7095636012), కబడ్డీ, ఖోఖో గోపి(9059606346), వాలీబాల్, బాక్సింగ్ యహజాజ్(9177234298), బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ సాయిసుమతి(7780124037), ఆర్చరీ - వినోద్ (8919295921), హాకీ - శ్రీలక్ష్మీకరుణ(7032018113)లను సంప్రదించాలని కోరారు.

తొమ్మిది ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒకరి అరెస్టు



స్మగ్లర్‌ను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖాజీపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 9 ఎర్రచందనం దుంగలను, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం ఎఫ్‌బీవో లింగానాయక్‌తో కలిసి శనివారం రాత్రి నుంచి ఖాజీ పేట పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. పత్తూరు సమాధులు చేరుకునే సరికి ఒక కారులో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్‌చేస్తూ పోలీసుల కంటపడ్డారు. చుట్టుముట్టే ప్రయత్నం చేయగా ఒకరు దొరికారు. మిగిలిన వారు పారిపోయారు. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగదు: యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బంది పెట్టడం తగదని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం తిరుపతిలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాబోధనకు ఆటంకంగా ఉన్న అన్ని యాప్‌లను రద్దు చేయాలన్నారు. యాప్‌ల వల్ల బోధన సక్రమంగా జరగడం లేదని విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టదన్నట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నాణ్యమైన విద్య అందించడానికే విద్యారంగ సంస్కరణలు అని చెప్పారని, కానీ అవి పాఠశాలలను, ఉపాధ్యాయుల సంఖ్యను కుదించడానికే ఉపయోగపడుతున్నాయని అన్నారు. కర్మయోగి, పీ4 ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాలని ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు అందించకపోవడం బాధాకరమన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ ఛైర్మన్‌ను తక్షణం నియమించాలని, నాలుగు డీఏలను, ఇతర బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు దండ రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు సురేష్, పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు పాల్గొన్నారు.